రాయితీపై వరి విత్తనాల పంపిణీ

విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపిపి, జెడ్‌పిటిసి

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: సబ్సిడీపై ప్రభుత్వం అందించే విత్తనాలను మండల రైతులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎంపిపి ఈశ్వరి, జెడ్‌పిటిసి జానకమ్మ సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎ.సిహెచ్ నీలవేణి ఆధ్వర్యంలో రైతులకు 90శాతం రాయితీపై వరి విత్తనాలు పంపిణీ చేశారు. పోతంగి పంచాయితీ ఎంపిటిసి గీత, సర్పంచ్ వెంకట్రావు, తెలుగుదేశం పార్టీ మాజీ మండల అధ్యక్షులు సుబ్బారావు, అరకు పార్లమెంట్ టిఎన్‌టియుసి ప్రధానకార్యదర్శి స్వామి, సింహాద్రి, భీమరాజు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సిపిఎం మండల కార్యదర్శిగా లక్ష్మణరావు

- వరుసగా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నిక

సమావేశంలో పాల్గొన్న అప్పలనర్స

వలసనైని లక్ష్మణరావు

ప్రజాశక్తి -హుకుంపేట: సిపిఎం మండల కార్యదర్శిగా మెరకచింత మాజీ సర్పంచ్ వలసనైని లక్ష్మణరావు వరుసగా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి పార్టీ జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా మండల నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఎన్నిక నిర్వహించగా, లక్ష్మణరావును మరోమారు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ అందరి సహకారంతో గ్రామాల్లో ప్రజా సమస్యలపైనా, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి అప్పలనర్స మాట్లాడుతూ, సిఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు జిఒ.3 ప్రయోజనాలను పునరుద్ధరిస్తూ చర్యలు చేపట్టాలని, ఏజెన్సీలో వందశాతం పోస్టులూ గిరిజనులకు దక్కేలా చట్టసవరణ లేదా, ఆర్డినెన్స్ తీసుకురావాలని కోరారు. భారత్, పాక్ యుద్ధ సమయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మధ్యవర్తిత్వాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆమోదించడం సరికాదన్నారు. దేశ అంతర్గత భద్రతలో ఇతర దేశాల జోక్యం సరికాదన్నారు. పెహల్గాం ఘటన, అనంతరం సింధూర్ ఆపరేషన్‌పై పార్లమెంట్‌లో చర్చించి, ప్రజలకు వాస్తవాలను చెప్పాల్సిన అవసరం కేంద్రంపై ఉందని, దీనికోసం ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి సూడిపల్లి కొండలరావు, సిపిఎం నేతలు సొంట్యాన హైమవతి, తాపుల కృష్ణారావు, పాంగి లింగమూర్తి, తమర్బ అప్పలకొండ, పాంగి సోమన్న, సీదరి చందూ, తూబూరు కోటిబాబు, వైస్ సర్పంచ్‌లు తడిగిరి, కొంతిలి కిల్లో రామారావు, డూరు కృష్ణమూర్తి, వార్డు సభ్యులు మజ్జి బాలకృష్ణ, మజ్జి రాజారావు, కొర్ర అప్పారావు, గొల్లోరి అప్పలస్వామి, ఆనంద్, మర్రి చిట్టిబాబు, బాకూరు దేవిరాజు, వలసనైని సంజీవ పాల్గొన్నారు.

నెలాఖరుకు మ్యుటేషన్ల ప్రక్రియ పూర్తి

- భూరీసర్వేలో నిర్లక్ష్యం చేస్తే కఠినచర్యలు
- అధికారులతో సమీక్షలో జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు : భూముల రీసర్వే ప్రక్రియను రెవెన్యూ అధికారులు మర్చిపోతున్నారని, అలక్ష్యం చేస్తే కఠినచర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్‌కుమార్ హెచ్చరించారు. ఈ నెలాఖరు నాటికి మ్యుటేషన్లు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. రీసర్వేకు 13 నోటిఫికేషన్ జారీ చేయకపోతే షోకాజ్ నోటీసులు ఇస్తామని తహాశీల్దార్లను హెచ్చరించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి 22 మండలాల రెవెన్యూ, సర్వే అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ భూములకు నీటి వినియోగం ఉన్నచోట నీటి పన్నులను వసూలు చేయాలని ఆదేశించారు. రంపచోడవరం డివిజన్‌లో మ్యుటేషన్లు, రీ సర్వే ప్రక్రియ సంతృప్తికరంగా లేదని, వేగం పెంచాలన్నారు. మ్యుటేషన్ల రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు.

హైకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వ భూముల ఆక్రమణలను తొలగించాలన్నారు. ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూమలను సర్వే చేసి రిపోర్టు సమర్పించాలన్నారు. రెవెన్యూ అధికారులు, ఎంపిడిఒలు, పంచాయతీ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి దురాక్రమణకు గురైన భూములను గుర్తించాలన్నారు. అభ్యంతరకరమైన పోరంబోకు భూములను ఆక్రమిస్తే తొలగించి, అభ్యంతరంలేని పోరంబోకు భూములలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని సూచించారు. గతంలో జారీ చేసిన ఇళ్ల స్థలాల పట్టాలను పున్ణపరిశీలించాలని ఆదేశించారు. ఇళ్ల పట్టాలు ఇచ్చిన వారికి వేరే చోట ఇళ్లు లేదా ఇళ్ల స్థలాలు ఉంటే గతంలో ఇచ్చిన ఇళ్ల పట్టాలను రద్దు చేసి, ఇళ్లు లేని వారికి కేటాయించాలని స్పష్టం చేసారు. సమావేశంలో పాడేరు, సబ్ కలెక్టరు శౌర్యమన్ పటేల్, డిఆర్ఒ కె.పద్మలత, సర్వే సహాయ సంచాలకులు కె. దేవేంద్రుడు, రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ (పర్చువల్‌గా) పాల్గొన్నారు.

ఉత్సాహంగా పర్యాటక యోగా

గిరిజన మ్యూజియంలో యోగాలో పాల్గొన్న పర్యాటకులు

ప్రజాశక్తి- అరకు /అరకు రూరల్ : యోగాంధ్ర సాధనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పర్యాటక కేంద్రమైన అరకు గిరిజన మ్యూజియం వద్ద 952 మందితో యోగ సాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం ఉందయం పాడేరు సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలందరూ యోగ సాధనలో భాగ స్వాములు కావాలని విజ్ఞప్తి చేసారు. ఈనెల 11న మారేడుమిల్లి, 17న చాపరాయి జలపాతాలు వద్ద పర్యాటక యోగ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారని తెలిపారు.

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ, నిరంతర యోగ సాధనతో ఆరోగ్యవంతులు అవుతారని, ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదన్నారు. విద్యార్థులలో శారీరక మానసిక దృఢత్వంతో పాటు తెలివితేటలు పెరుగుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ యోగ సాధనకు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌టిసి రీజనల్ చైర్మన్ దొన్నుదొర, యోగ జిల్లా నోడల్ అధికారి ఎంవిఎస్ లోకేశ్వరరావు, 175 మంది యోగశిక్షకులు, పలువురు జిల్లా అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది, పలువురు పర్యాటకులు, విద్యార్థులు పాల్గొన్నారు..

పన్నె(ౖ)డ రోడ్డును పట్టించుకోరా?

నీరు నిండిన గోతులతో పన్నెడ, పర్రెడ తారురోడ్డు

- నిండా గోతులతో ప్రయాణ సంకటం
- రూపు కోల్పోయిన ఆర్అండ్‌బి రహదారి
- ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టని అధికారులు

ప్రజాశక్తి- పెదబయలు : మండలంలో పన్నెడ, పర్రెడ మధ్య ప్రధాన రహదారి అధ్వానస్థితికి చేరుకోవడంతో ప్రజలు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. తారురోడ్డే అయినప్పటికీ, అనేక చోట్ల ఆ ఆనవాళ్లు లేకుండా నిండాగోతులమయమై మట్టి రోడ్డును తలపిస్తోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రహదారి గోతుల్లో నీరు చేరడంతో బురద, జారుడుమయంగా మారి వాహనాలు ముందుకు కదలని పరిస్థితి ఉండగా, ఏమాత్రం ఆదమరిచినా బైక్‌లు స్కిడ్ అయి ప్రమాదానికి గురికాడం ఖాయమనే పరిస్థితి నెలకొంది. రోడ్డు దుస్థితిపై అనేక సందర్భాల్లో సంబంధిత ఆర్అండ్‌బి అధికారులకు మొరపెట్టుకున్నా స్పందించే దిక్కులేదని గిరిజనం మండిపడుతున్నారు. మండలంలో పన్నెడ నుండి చిట్రాయిపుట్టు, సంపంగిపుట్టు, పర్రెడా జంక్షన్ వరకు ప్రధానరహదారి గతుకులమయంగా మారి ప్రజలకు నరకం చూపిస్తోంది. మోకాలిలోతుకు మించిన రోడ్డు గోతుల్లో వర్షపునీరు చేరడంతో రోడ్డు పొడుగునా నీటి గుంటలను తలపిస్తోంది. అనేకచోట్ల తారుపొర పూర్తిగా చెదిరిపోయి, మట్టిరోడ్డుగా మారడంతో వాహన దారులు, ముఖ్యంగా బైకిస్ట్‌లు సురక్షితంగా గమ్యం చేరుకోవడం గగనమయ్యే పరిస్థితి ఉంది. దీనిపై సంబంధిత ఆర్అండ్‌బి అధికారులకు ఎన్నోసార్లు లిఖితపూర్వకంగా, ఫోనుద్వారా మొరపెట్టుకున్నా, కనీసం మరమ్మతులు చేపట్టడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. మండల సమావేశాల్లో సమస్యను లేవనెత్తినా కనీస స్పందన లేదంటే, సంబంధిత ఆర్అండ్‌బి అధికారులు ఈ రోడ్డుపట్ల ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో స్పష్టమౌతోందని స్థానికులు అంటున్నారు. రోడ్డు దుస్థితిపై ఎవరైనా కాస్తా ఆక్రోషంతో ప్రశ్నిస్తే, చేతనైంది చేసుకోండంటూ ఆర్అండ్‌బి అధికారుల నుంచి నిర్లక్ష్య సమాధానం వస్తోందని మన్యవాసులు వాపోతున్నారు. ప్రస్తుతం వర్షాల సీజన్ రావడంతో రోడ్డు మరింత అధ్వానంగా మారిపోయే ప్రమాదం ఉందని, ఈలోగా కనీసం మరమ్మతులైనా చేపట్టి, భారీ గోతులను పూడ్చి రవాణాయోగ్యంగా ఈ రహదారిని మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

ఆర్అండ్‌బి రోడ్డు దుస్థితి ఇలా ఉంటే, మండల కేంద్రంలో రోడ్డు విస్తరణకు ఇక్కడి గిరిజన చిరు వ్యాపారులకు అధికారులు నోటీసులిచ్చిన నేపథ్యంలో, రోడ్డు విస్తరణతో పాటు ఇరువైపులా డ్రైనేజీని నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఆర్అండ్‌బి అధికారులు స్పందించి, పన్నెడ, పర్రెడ రోడ్డుకు తక్షణ మరమ్మతులు, తర్వాత పునర్నిర్మాణం చేపట్టకుంటే ఆందోళన చేయకతప్పదని ఏజెన్సీవాసులు హెచ్చరిస్తున్నారు. అరకు ఎమ్మెల్యే, ఎంపీలు, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్, ఇతర ఉన్నతాధికారులు రోడ్డు దుస్థితిపై వెంటనే స్పందించాలని కోరుతున్నారు.

ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా...

నిండా గోతులమయమై, రాకపోకలకు ఇబ్బందిగా మారిన పన్నెడ, పర్రెడ రహదారి దుస్థితిపై ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందన లేదు. మండలసమావేశంలో దీనిపై ఆర్అండ్‌బి అధికారులను ప్రశ్నించినా చర్యల్లేవు. ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ స్పందించాలి.

- కొర్ర రాజబాబు, వైస్ ఎంపిపి

'సృజన' ఆధ్వర్యంలో ఆధార్ సేవలు

ఆధార్ సేవలు పొందుతున్న గిరిజనులు

ప్రజాశక్తి- హుకుంపేట: మండలంలోని రాప, సంతారి పంచాయతీల్లో సృజన స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆధార్ అప్‌డేట్, ఇకెవైసి సేవలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆధార్ ఇకెవైసి అప్‌డేషన్ లేక, కొత్త రేషన్ కార్డు పొందలేక ఇబ్బందులు పడుతున్న గిరిజనులకు రెండు నెలల పాటు ఆయా పంచాయతీల్లో ఈ సేవలు అందుబాటులో ఉంటాయని సృజన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తెలిపారు.

ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ చిన్నపిల్లలను రేషన్ కార్డులో చేర్చేందుకు ఆధార్ తప్పనిసరి కావడం, ఆధార్ డేటాలో మార్పులు అవసరమవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి రాప, సంతారీ పంచాయతీల్లో ఈ సేవలను అందుబాటులోకి తెచ్చామన్నారు. సమీప పంచాయతీల ప్రజల కూడా ఈ సేవలను వినియోగించుకోవచ్చునాన్రు. సృజన స్వచ్ఛందసంస్థ మన్యంగ్రామాల్లో ఆహార భద్రత, ఆరోగ్యం, పోషణ, గిరిజనుల హక్కులపై నిరంతరం పనిచేస్తోందని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని పంచాయతీల్లో ఈ సేవలను విస్తరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కొర్రా నూకరాజు పాల్గొన్నారు,

చైతన్యపూరితం.. ఆదివాసీ జీపుజాతా

రంపచోడవరం డివిజన్‌లో అపూర్వ ఆదరణ
గిరిజన ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని నాయకుల డిమాండ్

విఆర్.పురంలో మాట్లాడుతున్న కిల్లో సురేంద్ర

ప్రజాశక్తి - రంపచోడవరం, అడ్డతీగల, చింతూరు, విఆర్.పురం, కూనవరం విలేకరులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెగా డిఎస్‌సిలో షెడ్యూల్డ్ ప్రాంత టీచర్ పోస్టులను మినహాయించి, ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన తలపెట్టిన జీపుజాతా మంగళవారం రంపచోడవరం డివిజన్‌లో చైతన్యపూరితంగా సాగింది. అడ్డతీగల, రంపచోడవరం, చింతూరు, విఆర్.పురం, కూనవరం మండలాల మీదుగా సాగుతూ రాత్రికి ఎటపాకకు చేరుకుంది. అన్నిచోట్లా ఈ యాత్రకు విశేష స్పందన లభించింది.

తొలుత అడ్డతీగల మండలం డి.భీమవరం పంచాయతీ నిమ్మల పాలెం గ్రామానికి ఈ యాత్ర చేరుకుంది. అనంతరం రంపచోడవరం మీదుగా చింతూరుకు వెళ్లింది. లక్కవరం గ్రామంలో స్థానికులు ఘన స్వాగతం పలికారు. చింతూరు ప్రధాన కూడలి వద్ద అమరవీరుల సెంటర్‌లో ఆదివాసీ అమరవీరులైన గంటం దొర, మల్లు దొర, కొమరం భీమ్, అల్లూరి సీతారామరాజుల విగ్రహాలకు యాత్రా బృందం ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. అక్కడ జరిగిన కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీలకు శత శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ నియామక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. గత నెల 31న సీతంపేట ఐటిడిఎ వద్ద ప్రారంభమైన తమ జీపు జాతా ఆదివాసీ యువతను కదిలిస్తూ బుధవారం కెఆర్.పురం ఐటిడిఎ వద్ద ముగుస్తుందని తెలిపారు. అక్కడ జరిగే సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

అనంతరం విఆర్.పురం మండలం చొప్పల్లి గ్రామానికి జాతా చేరుకోగా ఘన స్వాగతం లభించింది. తదుపరి సోములగూడెం, ఉన్నవారిగూడెం, రేఖపల్లి గుండా సాగింది. మండల కేంద్రంలోని మూడు రోడ్ల రేఖపల్లి జంక్షన్ వద్ద ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి పూనెం ప్రదీప్ కుమార్ అధ్యక్షతన సభ నిర్వహించారు. సోములగూడెం, రేఖపల్లి గ్రామాల్లో జరిగిన సభలు, ర్యాలీల్లో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, అధ్యక్షులు లోతా రామారావు, సహాయ కార్యదర్శి ఎ.అశోక్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిరిమల్లె రెడ్డి, పులి సంతోష్ కుమార్ మాట్లాడుతూ త్వరలో జరిగే కేబినెట్ సమావేశంలో ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సిపై స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. జిఒ నెంబర్ 3 రద్దుతో గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పూర్తిగా సన్నగిల్లాయన్నారు. అనంతరం కూనవరం మండలంలోని అయ్యవారిగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నేతల ప్రసంగాలు ఆలోచింపజేశాయి. డివిజన్ వ్యాప్తంగా జరిగిన జాతాలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొప్పెన కిరణ్, నాయకులు సోయం చిన్నబాబు, కారం సుందరయ్య, ఉదయం శ్రీరామ్మూర్తి, విఆర్.పురం ఎంపిపి కారం లక్ష్మి, రామవరం సర్పంచ్ కారం బుచ్చమ్మ, రేఖపల్లి సర్పంచ్ సరోజిని, పీసా కమిటీ ఉపాధ్యక్షులు సార పాండురాజు, కార్యదర్శి వేటగాని సూరి, సిఐటియు జిల్లా నాయకులు పల్లపు వెంకట్, మట్ల వాణిశ్రీ, ఆదివాసీ గిరిజన సంఘం కూనవరం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, నాయకులు పాయం సీతారామయ్య, పద్దం రాజు, ప్రభాకర్, ఎంపిటిసి జయసుధ, స్థానిక సర్పంచ్ తెల్లం నిరోషా, బొగ్గా వెంకమ్మ, సీసం సురేష్, లక్ష్మణ్, రాజయ్య, కోసం వీరయ్య, సత్తిబాబు, మనోజ్ ధర్మల్, వీరభద్రం నరకం చిన్నయ్య, తీగల శ్రీనివాస్, సాధల విద్యాసాగర్ పాల్గొన్నారు.

అడ్డతీగల మండలంలో మాట్లాడుతున్న లోతా రామారావు

అయ్యవారిగూడెంలో ప్రసంగాలను ఆసక్తిగా వింటున్న గిరిజనం

ఐఐటిలో ప్రవీణ్ రుద్రేశ్‌రెడ్డికి 264వ ర్యాంకు

ప్రవీణ్ రుద్రేశ్ రెడ్డి

ప్రజాశక్తి - అడ్డతీగల : మండలం తుంగమడుగులు గ్రామానికి చెందిన పీరు ప్రవీణ్ రుద్రేశ్ రెడ్డి ఐఐటిలో ఆల్ ఇండియా 264 ర్యాంక్ సాధించడం జరిగింది. తల్లిదండ్రులు, గ్రామస్తులు ప్రవీణ్‌ను కొనియాడారు. ర్యాంకు రావడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రవీణ్ తండ్రి చింతలబ్బాయి, తల్లి చెంబుల రాజేశ్వరి ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులే. కలెక్టర్ కావాలన్నదే తన ఆశయమని ప్రవీణ్‌రుద్రేశ్‌రెడ్డి తెలిపాడు.

బియ్యం స్వాధీనం చేసుకున్న రెవెన్యూ సిబ్బంది

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - రాజవొమ్మంగి: రాజవొమ్మంగిలో ఒక వ్యక్తి ఇంటిలో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ ఉంచారన్న సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తహాశీల్దార్ అల్లు సత్యనారాయణ తెలిపారు. సోమవారం వ్యక్తి ఇంట్లో ఆకస్మిక తనిఖీ చేపట్టి 350 కిలోల బియ్యం స్వాధీనం చేసుకుని స్టాక్ రూముకి తరలించినట్లు తెలిపారు. ఆర్ఐ చెల్లయ్యమ్మ, విఆర్ఒ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తున్న నిరసనకారులు

రోడ్డు నిర్మించాలని రాస్తారోకో

ప్రజాశక్తి - ఎటపాక : రోడ్లు నిర్మించాలంటూ ఐదు రోజులుగా నిర్వ:హిస్తున్న రిలే నిరాహార దీక్షలో భాగంగా మంగళవారం గుండాల కాలనీ ప్రజలు సిపిఎం నాయకత్వంలో గుండాల నుండి భద్రాచలం వెళ్లే రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. గత 15 సంవత్సరాలుగా రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని రోడ్లు వేసే వరకూ పోరాటం విరమించమని హెచ్చరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటి సభ్యులు ఐ.వి. మాట్లాడుతూ రోడ్డు నిర్మాణంలో ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారుల తీరును ఐ.వి. తప్పు పట్టారు. పై అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి త్వరగా రోడ్డు నిర్మాణానికి చొరవ చూపాలని ఐ.వి. అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కమిటి సభ్యులు ఇరపా సత్యం, పార్టీ నాయకులు సోయం వీరమ్మ, తోట శ్రీను, ఎన్.సుధాకర్, పసుపులేటి ప్రవీణ్, బండారు స్టాలిన్, భరణి కుమారి, సరియం లక్ష్మి, కొర్సాముత్తయ్య, తోట వెంకటరమణ, గంటా కొండమ్మ, తోట రమణ, మందా జగదీష్, ఈశ్వర్, కాశిమల్ల తిరుమలరావు, తోట శ్రీను పాల్గొన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - రంపచోడవరం : ఏజెన్సీలో ప్రజలు యోగాంధ్ర విజయవంతం చేయాలని రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 4వ తేదీన ఉదయం 6 గంటల నుండి గంగవరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో యోగాంధ్ర నిర్వహిస్తామన్నారు. ఏజెన్సీ నలుమూలల నుంచి కార్యక్రమానికి హాజరు కావాలన్నారు.

జనరల్ డ్యూటీ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులకు దరఖాస్తులు

ప్రజాశక్తి - రంపచోడవరం : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రంపచోడవరం నియోజకవర్గం ప్రభుత్వ డిగ్రీ కళాశాల , స్కిల్‌హబ్ నందు జనరల్ డ్యూటీ అసిస్టెంట్, దేశీయ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్స్‌లో శిక్షణ తీసుకునేందుకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వసుధ, డాక్టర్ పి.రోహిణి జిల్లా నైపుణ్య సంస్థ అధికారి వారు ఒక ప్రకటనలో తెలియచేశారు. శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 5వ తేది చివరితేదీ అన్నారు. వివరాలు కోర్సులు: జనరల్ డ్యూటీ అసిస్టెంట్ మరియు డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణ కాలం 90 రోజులు, విద్యార్హత పదోతరగతి అని తెలిపారు. రంపచోడవరంలోని గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో శిక్షణ ఇస్తారని తెలిపారు. వివరాలకు 6281618037, 6304634447 నంబర్లను సంప్రదించాలన్నారు.

6న మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - కొయ్యూరు: కొయ్యూరు మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 6వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ జి.డి.వి.ప్రసాదరావు తెలిపారు. బడుగు రమేష్ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం కానుందన్నారు. సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పూర్తి సమాచారంతో తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన సూచించారు.

నేడు గంగవరంలో యోగాంధ్ర

ప్రజాశక్తి - గంగవరం : మండల కేంద్రంలో యోగాంధ్ర కార్యక్రమం బుధవారం చేపడుతున్నట్టు ఎంపిడిఒ లక్ష్మణరావు తెలిపారు. కార్యక్రమం గంగవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్లో ఉదయం 6 గంటల నుండి ప్రారంభమవుతుందని తెలిపారు. కార్యక్రమానికి రంపచోడవరం ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం హాజరవుతారని తెలిపారు. మండల కేంద్రంలో ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు

అన్నదాత సుఖీభవ దరఖాస్తులకు అప్రూవల్

ప్రజాశక్తి - కొయ్యూరు : అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి కొయ్యూరు మండలంలో రైతుల నుంచి ఆన్‌లైన్‌లో 17,614 దరఖాస్తులు వచ్చాయని మండల వ్యవసాయ అధికారి డి.ఉమాదేవి మంగళవారం తెలిపారు. వాటిలో 15,006 దరఖాస్తులకు అప్రూవల్ ఇచ్చినట్లు చెప్పారు. వివిధ సమస్యల కారణంగా 285 దరఖాస్తులను రెవెన్యూ అధికారులకు పంపించామన్నారు. మృతి చెందిన వారిని, ప్రభుత్వ ఉద్యోగులను, ఇతర అనర్హులను గుర్తించి 2,323 దరఖాస్తులను తిరస్కరించినట్లు వెల్లడించారు.

సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యంతో ఇబ్బందులు

ప్రజాశక్తి - కొయ్యూరు : గ్రామ సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కొయ్యూరు మండలంలోని బూదరాళ్ల పంచాయతీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. రేషన్‌కార్డులో మార్పులు, చేర్పుల కోసం మంగళవారం మారుమూల గ్రామాల నుంచి సచివాలయానికి వచ్చారు. అయితే సంబంధిత అధికారులు అందుబాటులో లేకపోవడంతో వారు ప్రైవేటు వాహనాల్లో వెనుదిరిగారు. సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సురేంద్రకు వినతిపత్రం ఇస్తున్న బాధితులు

ఆదివాసీ ట్రస్టు బాధితులకు న్యాయం చేయండి

ప్రజాశక్తి-చింతపల్లి: పాడేరు ఏజెన్సీలో ఆదివాసీ ట్రస్టు పేరుతో కోట్లాది రూపాయలు వసూలు చేసి ఆదివాసులను మోసగించారన్న ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిలో సురేంద్ర అన్నారు. ఆ సంఘం అల్లూరి జిల్లా గౌరవ అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్‌తో కలిసి మాట్లాడుతూ ఉద్యోగాలు కల్పిస్తామని చెబుతూ లక్షలాది రూపాయలు వసూలు చేసిన ట్రస్టు నిర్వాహకుడు కోరాబు బాలం పడాల్ పై కఠిన చర్యలు తీసుకోవాలని, మోసపోయిన ఆదివాసులకు డబ్బులు తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. చింతపల్లిలో ఆదివాసి ట్రస్టు బాధితులంతా సురేంద్ర, ఇతర ఆదివాసీ గిరిజన సంఘం నేతలను కలిసి తమగోడు వెల్లబుచ్చుకున్నారు. ట్రస్టు నిబంధనలు ఉల్లంఘిస్తూ బిట్ కాయిన్స్, ఆన్‌లైన్ వ్యాపారాలు నిర్వహిస్తున్నట్లు బాధితులు ఆరోపించారు. సేవా కార్యక్రమాలకే పరిమితమవ్వాల్సిన ట్రస్టు వ్యాపారాల్లో తలదూర్చి మోసగించారని గిరిజనులు వాపోయారు. కార్యక్రమంలో ట్రస్టు వైస్ చైర్మన్ కొయ్యం చిన్నబ్బాయి, కార్యదర్శి వండలం బాలయ్య, చిక్కుడు అశోక్, జిల్లా నాయకులు ధనుర్జయ్, చిరంజీవి, ఇతర బాధితులు పాల్గొన్నారు.

నాస్కామ్ ఉచిత ఇంటర్న్ షిప్ ప్రోగ్రామ్‌కు దరఖాస్తులు

ప్రజాశక్తి- విశాఖపట్నం : ఏయు పరిధిలో విద్యార్థులకు 50000 ఇంటర్న్ షిప్‌లు నాస్కామ్ ఫ్యూచర్ స్కిల్స్ ఆధ్వర్యాన విద్యార్థులకు అందిస్తున్న ఉచిత స్వల్పకాలిక ఇంటర్న్‌షిప్ కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జిపి రాజశేఖర్ మంగళవారం తన కార్యాలయంలో విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి, ఆంధ్ర విశ్వవిద్యాలయం సంయుక్తంగా నాస్కామ్ సహకారంతో విద్యార్థులకు ఈ ఉచిత స్వల్పకాలిక ఇంటర్న్‌షిప్‌లను అందిస్తున్నట్లు ఆచార్య రాజశేఖర్ తెలిపారు. ఏయూ పరిధిలో 50,000 మంది ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్ షిప్ కల్పిస్తారని, దీనికి ఈ నెల 7వ తేదీలోగా ఉన్నత విద్యా మండలి పోర్టల్‌లో విద్యార్థులు తమ వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ ఇంటర్న్ షిప్‌ను నాలుగు విభాగాల్లో అందిస్తున్నట్లు తెలిపారు. సర్వీస్ నౌ సిస్టం అడ్మినిస్ట్రేటర్, ఎసెంచర్ ఆధ్వర్యాన ఏఐ ఫండమెంటల్ అండ్ ఏఐ రెడీ ఆఫ్ ఏఐ అసెండ్, గూగుల్ క్లౌడ్ జనరేటివ్ ఏఐ, సేల్స్ ఫోర్స్ డెవలపర్ విభాగాల్లో ఇంటర్న్ షిప్ అందిస్తున్నట్లు వివరించారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకొని తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. భవిష్యత్తులో మెరుగైన ఉపాధి అవకాశాలను పొందడానికి ఇటువంటి ఇంటర్న్ షిప్‌లు విద్యార్థులకు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, నాస్కామ్ ఫ్యూచర్ స్కిల్స్ ప్రైమ్ రీజినల్ హెడ్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. వివరాలకు 9052656967 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

గోల్డ్ మెడల్, ఎండోమెంట్ స్కాలర్‌షిప్‌కు విరాళం

ప్రజాశక్తి- విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం నేవల్ ఆర్కిటెక్చర్ విభాగంలో రాజ్ టిఎఐ గోల్డ్ మెడల్ ఏర్పాటు చేయడానికి రూ.మూడు లక్షల విరాళాన్ని, శిరి అండ్ అనిల్ రాజ్ ఎండోమెంట్ స్కాలర్‌షిప్ ఏర్పాటుకు రూ.7.50 లక్షల విరాళాన్ని టెక్నాలజీ అసోసియేట్స్ సంస్థ అందించాయి. విరాళానికి సంబంధించిన డీడీలను టిఎఐ ఇంజినీర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ జానకి రామన్ గణేషన్ ఏయూ ఉపకులపతి ఆచార్య జిపి రాజశేఖర్ సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనుంజయరావుకు అందజేశారు. నేవల్ ఆర్కిటెక్చర్, మెరైన్ ఇంజినీరింగ్ విభాగంలో ప్రతిభ చూపిన విద్యార్థికి గోల్డ్ మెడల్‌ను బహుకరించాలని, విద్యలో ప్రతిభ చూపుతూ ఆర్థిక సహాయం అవసరమైన విద్యార్థికి స్కాలర్‌షిప్‌ను బహుకరించాలని దాతలు కోరారు.

ఘనంగా మోదకొండమ్మ జాతర

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు
పకడ్బందీ ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ

ప్రజాశక్తి- మాడుగుల : ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం మాడుగల మోదకొండమ్మ జాతర మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నాలుగు గంటల నుండి అమ్మవారిని పూలమాలలతో అలంకరించి కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, ఉత్సవ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. తర్వాత భక్తులకు దర్శనభాగ్యం కల్పించగా, ఇళ్ల వద్ద పూజించిన ఘటాలను పట్టుకొని ఆలయానికి బయలుదేరి మొక్కులు ముడుపులు చెల్లించుకున్నారు. వేకువజాము నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఒకేరీతిన భక్తులు తాకిడి ఉండడంతో ఆలయ కమిటీ చేసిన ఏర్పాట్లతో ఎటువంటి ఇబ్బంది లేకుండా పోయింది. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ఆర్యవైశ్య సంఘం సభ్యులు, పెరుమాళ్ళ వెంకటరావు కుమారుడు శివమణికంఠ పేరుమీద భక్తులకు ఉచిత అన్నసమారాధన నిర్వహించారు. పలువురు స్వచ్ఛంద సంస్థలు గ్రామ పెద్దలు ఎక్కడకక్కడే దారి పొడుగునా చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. జాతర మహోత్సవంలో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఎస్సై జి నారాయణరావు పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించారు. శతకం పట్టు వద్ద కొలువై మోదకొండమ్మ అమ్మవారిని, పాదాలను సాయంత్రం తిరిగి ప్రధాన ఆలయానికి ఊరేగింపుగా పలు సాంస్కృతిక కార్యక్రమాలతో తీసుకొని వచ్చారు.

మోదమ్మను దర్శించుకున్న ప్రముఖులు

జాతర సందర్భంగా మాడుగల మోదకొండమ్మను పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. అనకాపల్లి ఎంపీ సిఎం రమేష్, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ్, వెలమ కార్పొరేషన్ చైర్మన్ పివిజి కుమార్ దంపతులు, మాజీ ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ ఇతర ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, కమిటీ సభ్యులు వారిని సాదరంగా ఆహ్వానించి ఆలయ గర్భగుడిలో ప్రత్యేక పూజల అనంతరం దుశ్శాలువా, అమ్మవారి మెమెంటోలతో సత్కరించారు.

నేతలను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సోలార్ వాటర్ ప్లాంట్లకు మరమ్మతులు

నాలుగు గ్రామాల్లో తాగునీటి కష్టాలపై స్పందన

సోలార్ పథకాన్ని బాగుచేస్తున్న ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది

ప్రజాశక్తి-హుకుంపేట : మండలంలోని నాలుగు గ్రామాల్లోని సోలార్ మంచినీటి పథకాలకు నాలుగేళ్ల తర్వాత మోక్షం లభించనుంది. ఏర్పాటైనా ఏడాదిలోనే మరమ్మతులకు గురై మూలకు చేరిన ఈ పథకాల మరమ్మతులకు తాజాగా నిధులు మంజూరుకాగా, పనులు చేపడుతున్నారు. దీంతో గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పట్టం పంచాయతీ గంగూడి గ్రామంలో సోలార్ వాటర్‌ప్లాంట్ మరమ్మతు పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. వైసిపి హయాంలో నిర్మించిన ఈ పథకం పట్టుమని కొన్నాళ్లయినా నీరు ఇవ్వకముందే మరమ్మతుకు గురై మూలకు చేరింది. దీంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్న స్థానిక గిరిజనులు పలుమార్లు అధికారులకు విన్నవించినా ఎటువంటి స్పందన లేదు. దీంతో నాలుగేళ్లుగా ఈ పథకం మూలకు చేరింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాగునీటి పథకాల మరమ్మతులపై దృష్టి పెట్టి నాలుగు పథకాలకు నిధులు మంజూరు చేయడంతో పనులు ప్రారంభమయ్యాయి. ఆర్‌డబ్ల్యుఎస్ జూనియర్ ఇంజినీరు జగదీష్ పర్యవేక్షణలో మరమ్మతు పనులు చేస్తున్నారు ఎట్టకేలకు నీటి పథకాన్ని బాగుచేస్తుండడంతో, గ్రామస్తులు తమవంతు సహకారం అందిస్తున్నారు. కాగా మండలంలో. పట్టం పంచాయతీలోని కుమ్మరిపుట్టు, గంగూడి, అమనగిరి, బూరువలస గ్రామాల్లో సోలార్ ప్లాంట్‌ల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయని, ఒక్కో పథకాన్ని రూ.1.30 లక్షలతో బాగుచేయనున్నట్లు ఆర్‌డబ్ల్యుఎస్ జూనియర్ ఇంజినీర్ జగదీష్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో అన్ని గ్రామాల్లోని సోలార్ నీటిపథకాల పరిస్థితిని సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పరిశీలించి సమాచారమిస్తే, ప్రభుత్వానికి తగు చర్యలకు నివేదిస్తామన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టం సర్పంచ్ కించాయి కృష్ణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కామరాజు, వార్డ్ సభ్యుడు కిల్లో బేసు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా మత్స్య మాడుగులమ్మ పండుగ

ప్రజాశక్తి -జి.మాడుగుల : మండలంలోని సంతబయలు గ్రామంలో వెలసిన మత్స్య మాడుగులమ్మ తల్లి పండుగను మంగళవారం గ్రామపెద్దలు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఘటాలను సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. ప్రత్యేకపూజలు నిర్వహించారు.

రేషన్ పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి -పాడేరు : మండలంలోని సుంద్రుపుట్టు రేషన్ డిపోలో కార్డుదారులకు మంగళవారం జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్ కుమార్ రేషన్ పంపిణీ చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రేషన్‌కార్డు కలిగిన ప్రతి లబ్దిదారునికి రేషన్ సరుకులు సక్రమంగా అందించాలని పౌర సరఫరాల అధికారులు, డిపోల డీలర్లను ఆదేశించారు. అలాగే కార్డుదారులు సైతం రేషన్‌బియ్యాన్ని పక్కదోవ పట్టించకుండా సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిఎస్ఒ బి. గణేష్‌కుమార్, పాడేరు తహశీల్దార్ వి.త్రినాధరావునాయుడు, పౌర సరఫరాలశాఖ ఉప తహశీల్దార్ ప్రశాంత్ పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న దొన్ను దొర

ప్రజలకు వెన్నుపోటు పొడిచింది జగనే

- దొన్ను దొర విమర్శ

ప్రజాశక్తి- అరకులోయ: రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచింది మాజీ ముఖ్యమంత్రి జగనేనని అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి, ఆర్‌టిసి విజయనగరం రీజినల్ జోన్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర అన్నారు. మంగళవారం అరకుయలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ, జగన్మోహన్ రెడ్డి పాలనలో ఐదేళ్లు ప్రజలకు చేసిందేమీ లేదని, సొంత కుటుంబానికే వెన్నుపోటు పొడిచిన ఘనత జగన్మోహన్‌రెడ్డి ది అన్నారు. ఎన్ని డ్రామాలు చేసినా జగన్‌ను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నార. జగన్ అధికారంలో ఉన్నప్పుడు చేసిన కుంభకోణాల నుంచి ప్రజల దృష్టిని మళించేందుకు వెన్నుపోటు అని కొత్త నాటకానికి శ్రీకారం చుట్టాలన్నారు. ఏడాది కాలంలో జగన్ 10 శాతం హామీలు అమలు చేస్తే, కూటమి ప్రభుత్వం ఏడాదిలో 70 శాతం హామీలు అమలు చేసిందన్నారు.ఐదేళ్లలో 85 హామీలకు ఎగనామం పెట్టి వెన్నుపోటు పొడిచిన జగన్ నిర్వాకాన్ని గమనించిన జనం, గడచిన ఎన్నికల్లో 11సీట్లకే పరిమితం చేసి గుణపాఠం చెప్పారన్నారు. సొంత బాబాయ్‌ని గొడ్డలిపోటుతో హత్య చేసిన వారిని పక్కన పెట్టి వెన్నుపోటు పొడిచింది జగన్ కాదా అనిప్రశ్నించారు. ఆస్తికోసం తల్లి,చెల్లిని వెన్నుపోటు పొడిచిన ఘనత ఎవరిదో జగన్ చెప్పాలన్నారు. మెగా డీఎస్సీ, జాబ్ కేలండర్ పేరుతో నిరుద్యోగ యువతకు జగన్ వెన్నుపోటు పొడిచారన్నారు. సబ్ ప్లాన్ నిధుల పక్కదారి పట్టించి ఎస్‌సి, ఎస్‌టిలకు వెన్నుపోటు పొడిచారన్నారు. 27 సంక్షేమ పథకాలను రద్దు చేసి బిసిలకు వెన్నుఓటు పొడిచారన్నారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో రోడ్లన్నీ గుంతలతో నిండిఉంటే ,ఏడాది కూటమిపాలనలో 20 వేల కిలోమీటర్ల రోడ్లు బాగుచేశామని, జగన్మోహన్ రెడ్డి మూయించిన 203 అన్న క్యాంటీన్లను తెరిచి పేద ప్రజలకు కడుపునిండా తిండి పెడుతున్నామన్నారు. వైసిపి పాలనలో పంచాయతీలకు కేంద్రం కేటాయించిన నిధులుకూడా దారి మళ్లించిన చరిత్ర ఉందన్నారు. జగన్ బండారం ఒక్కొక్కటిగా బయటికి వస్తుందని మళ్లీ జైలుకు వెళ్లక తప్పని పరిస్థితుల్లో ఉనికి కోసం ఆరాటపడుతున్నారన్నారు. సమావేశంలో పెదలబుడు సర్పంచ్ పెట్టేలి దాసు బాబు, అరకులోయ డుంబ్రిగూడ తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు లోక్కోయి మహాదేవ్, ఆనంద్, వెంకటరావు, నాగరాజు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి-విశాఖపట్నం : ప్రజలందరి భాగస్వామ్యంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జిపి.రాజశేఖర్ అన్నారు. ఏయు విద్యా విభాగం ఆధ్వర్యాన ఈ నెల 5వ తేదీన నిర్వహించే పర్యావరణ దినోత్సవ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం ఆయన తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ, పర్యావరణ హితంగా మన జీవన విధానాన్ని మలచుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ఉపాధ్యాయులుగా నిలిచే బిఇడి, ఎంఇడి విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. తద్వారా వారు పాఠశాల స్థాయి నుంచి చిన్నారులలో పర్యావరణ స్పృహను పెంపొందించడం, సంరక్షించే బాధ్యతను వారికి అందించడం జరుగుతుందని చెప్పారు. పర్యావరణ పరిరక్షణ ద్వారా మాత్రమే మానవ మనుగడ సాధ్యపడుతుందనే విషయాన్ని ప్రజలు అర్థం చేసుకొని నడుచుకోవాలని సూచించారు.

ధాన్యం పంపిణీ చేస్తున్న ఎఒ, ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి కుంజం నందిని

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

ప్రజాశక్తి - మారేడుమిల్లి: మారేడుమిల్లి మండలం తాడేపల్లి పంచాయతీ డి.వెలమలకోటలో మారేడుమిల్లి మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వీక్షిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం మంగళవారం రైతుసేవ కేంద్రాల వద్ద నిర్వహించారు. ఈ క్రమంలో ఆర్‌వైఎస్ఎస్, ఎపిసిఎన్ఎఫ్ ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి కుంజం నందిని ప్రధానంగా ప్రకృతి వ్యవసాయం చేయాలంటే నవధాన్యాలు మొదటగా వేయాలన్నారు. రైతు పొలంలో విత్తనం వేసినప్పటి నుండి పంట తీసేంత వరకూ వ్యవసాయాధికారులు ఇచ్చే సూచనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. అంతరపంటలు వేయడం వలన అధిక దిగుబడులు వస్తాయన్నారు. ప్రతి రైతు ఇంటి ఆవరణలో పెరటి తోటలు వేయాలన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం నుండి డాక్టర్ క్రాంతికుమార్, ప్రవీణబాబు, దయాకర్, సుధీర్ , సుమన్ కళ్యాణి, కస్తూరి కృష్ణ, రవిశంకర్ శాస్త్రవేత్తలు, పిఎం కిసాన్, పిఎం ఫసల్ బీమా యోజన గురించి వివరించారు. జీడిమామిడిలో యాజమాన్య పద్ధతులు వివరించారు. రెండు గ్రామాల సర్పంచులు, రైతులు హాజరయ్యారు.

గృహాలు లేని గిరిజనులకు మూడు సెంట్లు ప్రభుత్వ స్థలం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: గృహాలు లేని అర్హులైన గిరిజనులకు ప్రభుత్వం జిఒఎంఎస్ 23 ప్రకారం మూడుసెంట్లు స్థలం మంజూరు చేస్తుందని తహశీల్దార్ అల్లు సత్యనారాయణ మంగళవారం విలేకరులకు తెలిపారు. ఇంటి స్థలం కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ అవకాశాన్ని తెల్లకార్డు కలిగిన గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

వృద్ధులకు రేషన్ అందిస్తున్న తహశీల్దార్ పి.రామకృష్ణ

వృద్ధులకు ఇంటి వద్దే రేషన్ పంపిణీ

ప్రజాశక్తి - రంపచోడవరం : 65 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఇంటివద్దకే రేషన్ సరుకులు పంపిణీ చేయడం జరుగుతుందని రంపచోడవరం తహశీల్దార్ పి.రామకృష్ణ అన్నారు. మంగళవారం రంపచోడవరం సిరిగందలపాడులో రేషన్ సరుకుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో ప్రతి గ్రామంలో 65 సంవత్సరాలు నిండిన వృద్ధులకు ఇంటి వద్దకు వచ్చి రేషన్ సరుకులు పంపిణీ చేస్తారని ఈ పంపిణీ కార్యక్రమంలో ఎవరికైనా ఇబ్బంది కలిగినా లేక సరుకులు పంపిణీ చేయకపోయినా తమ దృష్టికి తీసుకువస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రేషన్ సరుకులు తీసుకోపోతే రేషన్‌కార్డులు తొలగిస్తామని వస్తున్న వరంతులను నమ్మవద్దని అటువంటిదేమీలేదన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ఎస్.కె జిలాని, విఆర్ఒ శివ పాల్గొన్నారు.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - సీలేరు: సీజన్‌లో వ్యాపించే జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి సౌమ్య తెలిపారు. జికె వీధి మండలం సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే సందర్భంగా మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ కార్యకర్తలకు రోగులపట్ల అనుసరించవలసిన విధానాలపై అవగాహన కల్పించారు. ఆశా కార్యకర్తలు గర్భనిర్ధారణ కిట్లను కనీసం 10 ఉండేలా చూసుకోవాలని పేర్కొన్నారు. అనారోగ్యంగా ఉన్న చిన్నారులకు ఒఆర్ఎస్, జింకు వినియోగించినప్పుడు పరిశుభ్రంగా చేతులు కడుక్కోవాలన్నారు. ఆశా కార్యకర్తలు గ్రామాల్లో పర్యటించినప్పుడు ఇంటి పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలనే విషయమై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ త్రినాథ, బాలామణి హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ. ఎఎన్ఎంలు బి.దేవిఅరుణ్‌కుమారి, కె.విశ్వనాందకుమారి ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైద్యాధికారి సౌమ్య

మలేరియా జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆదివాసీలు మలేరియా జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని ధారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డి.కె.హిమబిందు అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో జ్వరాలు, అతిసార ప్రబలే అవకాశం ఉందన్నారు. జ్వరపీడితులు విధిగా రక్తపరీక్ష చేయించుకోవాలన్నారు. కాచి వడబోసిన నీరు తాగాలని, నిల్వ చేసిన ఆహారం తినరాదని సూచించారు. ఆశా కార్యకర్తలు తమ పరిధిలో గ్రామాలను సందర్శించి ప్రజల యోగక్షేమాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు.. కార్యక్రమంలో పిహెచ్ఎన్ రాణి, పాల్గొన్నారు.

ఉపాధి కల్పించే లక్ష్యంతోనే కుట్టుమిషన్ల పంపిణీ

ప్రజాశక్తి - కొయ్యూరు : మహిళలకు ఉపాధి కల్పించే లక్ష్యంతోనే కూటమి ప్రభుత్వం కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్నట్టు పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. మండలంలోని కాకరపాడు వద్ద కుట్టుమిషన్ల శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొయ్యూరు మండలంలో 103 మంది మహిళలు దరఖాస్తు చేసుకోగా వీరికి మూడు నెలలు శిక్షణ ఇచ్చి ప్రతి ఒక్క మహిళకు మిషన్లు ఉచితంగా అందిస్తారన్నారు. కార్యక్రమంలో కొయ్యూరు మండల పార్టీ ప్రధాన కార్యదర్శి తోట దొరబాబు, మండల మహిళా అధ్యక్షురాలు బోనంగి సత్యవతి, సర్పంచ్ పిట్టా సింహాచలం, చింతపల్లి మండల పార్టీ అధ్యక్షుడు కిలో పూర్ణచంద్రరావు జికె విధి ఎంపిటిసి పసుపులేటి నాగమణి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

కుట్టుమిషన్ కేంద్రాన్ని ప్రారంభించిన గిడ్డి ఈశ్వరి

రహదారి విస్తరణలో బాధితులను ఆదుకోవాలి

మంత్రి సుభాష్‌కి ఎమ్మెల్యే శిరీషాదేవి వినతి

రాష్ట్ర కార్మికశాఖ మంత్రి సుభాష్‌కి విన్నవిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

ప్రజాశక్తి- రంపచోడవరం : డివిజన్‌లో ఆర్అండ్‌బి, జాతీయ రహదారి విస్తరణ పనుల్లో చాలామంది తీవ్రంగా నష్టపోయారని ఇళ్లు, స్థలాలు చాలావరకూ కోల్పోయారని బాధితులకు కూటమి ప్రభుత్వం న్యాయం చేయటానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి సుభాష్‌ని మంగళవారం ఎమ్మెల్యే శిరీషాదేవి, తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయ్ భాస్కర్ కోరారు. మంగళగిరి పార్టీ కార్యాలయంలో ఆయనను కలిసి రంపచోడవరం డివిజన్‌లో జాతీయ రహదారి పనుల్లో నష్టపోయిన బాధితుల విషయం గురించి చర్చించారు.

రహదారి పనుల్లో భాగంగా తీవ్రంగా నష్టపోయిన రంపచోడవరం, మారేడుమిల్లి మండలాల వారికి 3 సెంట్లు స్థలం చొప్పున ప్రత్యామ్నాయంగా ఇవ్వాలని కోరారు. గంగవరం, రాజవొమ్మంగి, అడ్డతీగల మండలాల్లో కూల్చివేతలు ఇంకా ప్రారంభం కాలేదు కాబట్టి ఇప్పటికే 516 ఇ జాతీయ రహదారి పనుల్లో నష్టపోయి ఉన్నారని తెలిపారు. కాబట్టి రహదారి విస్తరణ పనులు నిలుపుదల చేయాలని కోరారు. సదరు విషయం అల్లూరి కలెక్టర్ దినేష్‌కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడి ఆక్రమణలు కూల్చివేత నిలిపివేయాలని కోరారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారని, కావున బాధితులు ఎవరూ అధైర్యపడకుండా ఉండాలని సూచించారు.

రైల్వే టికెట్ కన్ఫర్మేషన్‌కు కొత్త ఫీచర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భారత రైల్వేలో టికెట్లు రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులకు సీట్ల లభ్యతకు సంబంధించి ఒక ప్రత్యేకమైన ఫీచర్‌ను 'మేక్ మై ట్రిప్' అందుబాటులోకి తీసుకువచ్చిందని ఆ సంస్థ ప్రతినిధి రాజేష్ తెలిపారు. మంగళవారం రైల్వేస్టేషన్‌లోని మొదటి ప్లాట్ ఫామ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు 60 రోజులు ముందుగా రిజర్వేషన్ చేసుకున్న టికెట్లకు సంబంధించి 40 శాతం టికెట్లు కచ్చితంగా కన్ఫర్మ్ అవుతాయని ఆ తర్వాత మిగిలిన టికెట్ల కన్ఫర్మేషన్‌పై ప్రయాణికుల్లో తీవ్ర ఆందోళన ఉంటుందని ఈ సమస్యను పరిష్కరించేందుకు గాను సాంకేతికతను ఉపయోగించి పరిష్కారాన్ని తాము కనుగొన్నామన్నారు. ప్రతి రైలుకు ప్రయాణ తేదీకి ముందు 13 రోజుల నుండి వెయిటింగ్ లిస్టు ప్రారంభం అవుతుందని 20 రోజులకు ముందు రిజర్వేషన్ చేసుకున్న టికెట్లు మాత్రమే కన్ఫర్మ్ అవుతున్నాయని ఈ సమస్యలన్నీటికి చెక్ పెడుతూ తమ సంస్థ ఒక ప్రత్యేకమైన ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చామని ఈ ఫీచర్ ద్వారా తమ టికెట్లు కన్ఫర్మ్ అవుతాయో లేదో ఖచ్చితంగా తెలుస్తుందని ఆయన అన్నారు. కావున ఈ ఫీచర్‌ను అందరూ వినియోగించుకోవాలని తద్వారా రైలు ప్రయాణాలను మరింత సౌకర్యవంతం చేసుకోవాలని ఆయన కోరారు.

రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు శిశువులు మృతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలో రెండు రోజుల వ్యవధిలో రాజవొమ్మంగి, లాగరాయి పిహెచ్‌సిల పరిధిలో ఇద్దరు శిశువులు మృతి చెందారు. మంగళవారం లాగరాయి పిహెచ్‌సి పరిధిలో నెల్లిమెట్ల గ్రామానికి చెందిన ఎళ్ళెం శిరీష మూడో కాన్పులో రెండునెలల క్రితం ఆడబిడ్డకు జన్మనిచ్చింది.మంగళవారం శిశువు అస్వస్థతకు గురి కావడంతో రాజవొమ్మంగి పిహెచ్‌సికి తరలించారు. పిహెచ్‌సి వైద్యాధికారి సుష్మ ప్రథమచికిత్స నిర్వహించి మెరుగైన చికిత్స కోసం ఏలేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. 108లో ఆశా వర్కర్ సహాయంతో తరలించారు.అప్పటికే శిశువు మృతి చెందింది. రక్తంలో ఇన్ఫెక్షన్ కావడం వల్ల ఏలేశ్వరం ఆసుపత్రికి తరలించినట్లు వైద్యాధికారి సుష్మ తెలిపారు. రెండు రోజుల్లో రెండు శిశుమరణాలు జరిగాయి. ఈ నెల 2వ తేదీన జడ్డంగి పిహెచ్‌సికి వాతంగి గ్రామానికి చెందిన సంపంగి రాఘవ రెండో కాన్పులో జన్మించిన మూడు నెలల ఆడశిశువు శ్వాస సమస్యతో బాధపడుతుండడంతో జడ్డంగి పిహెచ్‌సిలో ప్రథమ చికిత్స నిర్వహించి అడ్డతీగల పిహెచ్‌సికి, అనంతరం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శిశువు మృతి చెందింది. రెండు రోజుల వ్యవధిలో రెండు శిశు మరణాలు జరగడంతో మండల వాసులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు సమీక్షలు, పర్యవేక్షణ లేకపోవడంతో ఇటువంటి సంఘటనలు చోటు చేసుకుంటు న్నాయని చర్యలు చేపట్టాలని గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కుంజం జగన్నాథం,కొండ్ల సూరిబాబు కోరారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపేందుకే వెన్నుపోటు దినం

- వైసిపి జిల్లా అధ్యక్షులు కెకె.రాజు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సర కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపేందుకు వెన్నుపోటు దినం కార్యక్రమం నిర్వహిస్తున్నామని వైసిపి జిల్లా అధ్యక్షులు కె.కె రాజు అన్నారు. బుధవారం వైసిపి తరపున చేపట్టే వెన్నుపోటు దినం కార్యక్రమం అనుమతి కోసం మంగళవారం కె.కె రాజు ఆధ్వర్యంలో వైసిపి నాయకులు నగర పోలీస్ కమిషనర్ కార్యాలయానికి వచ్చారు. ఎడిసిపి అడ్మినిస్ట్రేషన్ రాజ్‌కమల్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, చంద్రబాబు గెలుపే లక్ష్యంగా, అమలుకాని సూపర్‌సిక్స్ హామీలు పేర్లు చెప్పి ప్రజలను మభ్యపెట్టి గెలిచారన్నారు. వైసిపి మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు,ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన సంవత్సర కాలంలో రాష్ట్రాన్ని అరాచక, అత్యాచార, మద్యాంధ్ర ప్రదేశ్‌గా మార్చేశారని విమర్శించారు. కార్యక్రమంలో, వైసిపి తూర్పు ఇన్‌చార్జ్ మళ్ళీ అప్పారావు, పార్టీ పర్యవేక్షకులు రవిరెడ్డి, మాజీ రాష్ట్ర కార్యదర్శి పి. సతీష్‌వర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి ద్రోణంరాజు శ్రీవత్సవ, జిల్లా అధికార

బాదంతో రోగ నిరోధక శక్తి పెంపు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రోగనిరోధకశక్తి పెరగడానికి బాదం తరహా పోషకాలు కలిగిన ఆహారాన్ని రోజూ తీసుకోవాలని పోషకాహార నిపుణురాలు డాక్టర్ రోహిణి పాటిల్ సూచించారు. స్థానిక హోటల్‌లో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ, ఇన్ఫెక్షన్లు కారణంగా తరచుగా దగ్గు, జలుబు, జీర్ణ సమస్యలు వంటి అనేక ఆరోగ్య సవాళ్లు ఎదురవుతాయన్నారు. బాదం, పసుపు, అల్లం వంటి పోషకాలు అధికంగా ఉండే సూపర్‌ఫుడ్‌లను ఆహారంలో చేర్చుకోవడం ద్వారా రోగనిరోధకశక్తిని బలోపేతం చేసుకోవచ్చన్నారు. కాలిఫోర్నియా బాదం ముఖ్యమని దీనిలో పోషకాలు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయని తెలిపారు.